సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



నెత్తురోడ్డుతున్నాయి

ఈ ఏడాది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. మొత్తం 1,838 ప్రమాదాల్లో 674 మంది దుర్మరణం పాలయ్యారు.




కనీస వేతనాలు చెల్లించాలి

పశు సంవర్ధక శాఖలో ఏళ్ల తరబడి పని చేస్తున్న గోపాలమిత్రలకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు.

8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 11,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 2,150, పశ్చిమ డెల్టాకు 5,750 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

శనైశ్చరుని హుండీ ఆదాయం లెక్కింపు



మండపల్లి శనైశ్చరాలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన కొత్తపేట మండలం మండపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం ఈఓ ఎం.రాధాకృష్ణ పర్యవేక్షణలో దేవస్థానం సిబ్బంది, భక్తులు, స్థానికులు లెక్కింపులో పాల్గొన్నారు. ఆరు నెలలకు గాను హుండీ ద్వారా రూ.6,85,870 ఆదాయంతో పాటు 31.500 గ్రాముల బంగారం, 754 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ వచ్చినట్టు చక్రధరరావు తెలిపారు. అన్నదాన ట్రస్ట్‌కు రూ.26,067, దేవస్థానం క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.32,957 ఆదాయంతో పాటు 4 గ్రాముల వెండి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సిద్దంశెట్టి వీవీ సత్యనారాయణ, గ్రామ పెద్దలు అడపా వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓ ఉత్తరకుమారి, సేవా వలంటీర్లు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ



శంకరగుప్తంలో మైనింగ్ సిబ్బంది గ్రామస్తుల మధ్య వాగ్వాదం

మలికిపురం: శంకరగుప్తం గ్రామంలో సోమవారం మైనింగ్ ఏజెన్సీ సిబ్బంది, రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మైనింగ్ పన్ను కోసం సిబ్బంది వెళ్లడంతో గలాటా జరిగింది. గ్రామానికి చెందిన బుంగ జ్యోతి అనే మహిళా రైతు తన పొలం నుంచి ఇంటి పునాదికి ఇసుక తరలిస్తుండగా మైనింగ్ సిబ్బంది వచ్చి అడ్డగించారని ఆమె మలికిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ అనుమతి లేకుండా ఎందుకు తరలిస్తున్నావని ప్రశ్నిస్తూ దురుసుగా ప్రవర్తించడంతో పాటు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని కూడా ఆమె పేర్కొన్నారు. తాను ఇంటి పునాదులకే ఇసుకను తరలిస్తున్నానని, తానెందుకు పన్ను చెల్లించాలని అడిగానని ఆమె చెప్పారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా గ్రామంలో ఇరుపక్షాలు గుమిగూడడంతో ఘర్షణ జరిగింది. పలువురు గాయపడినట్లు సమాచారం. ఘర్షణలో గాయపడిన మైనింగ్ ఏజెన్సీ సిబ్బంది రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపండి

అమలాపురం రూరల్: ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగింది. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్‌డీఏ, డ్వామా ఐసీడీఎస్ పీడీలు డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, ఎస్.మధుసూదన్, ఎం.ఝాన్సీరాణిలు అర్జీదారుల నుంచి సుమారు 165 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం నోడల్ అధికారులు సకాలంలో సమస్యలు పరిష్కరించే దిశగా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. మండల, డివిజన్ స్థాయిల్లోనూ సమర్థవంతంగా అమలు చేస్తే, జిల్లా స్థాయికి వచ్చే అర్జీల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందనే విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. డీసీహెచ్‌ఎస్ కార్తీక్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దుర్గారావు దొర, డీపీఓ శాంతాలక్ష్మి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 20 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 20 అర్జీలు వచ్చాయి. ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలను వివరించారు. ఈ ఫిర్యాదులపై డీఎస్పీ, సీఐ, ఎస్సైలు తక్షణమే స్పందించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలే ఉన్నాయి.

ఫుల్ జోష్

- న్యూ ఇయర్‌కు సర్వం సిద్ధం
- రిసార్ట్స్, హోటళ్లు నెల రోజుల ముందే బుక్
- గోదావరి బాట పట్టిన ఐటీ ఉద్యోగులు
- పుట్టగొడుగుల్లా బిర్యానీ సెంటర్లు
- మద్యం దుకాణాల్లో ఫుల్ స్టాక్

సాక్షి, అమలాపురం: మరికొద్ది గంటల్లో న్యూ ఇయర్ రాబోతోంది. ఏడాది పొడవునా జరిగిన సంఘటనలన్నీ గత వత్సర జ్ఞాపకాలుగా మారబోతున్నాయి. ఎన్నో అనుభూతులు.. మరెన్నో అనుభవాలు.. సుఖ సంతోషాలు.. బాధలు.. చేదు ఫలితాలను పంచి ఇచ్చిన మరో సంవత్సరం తెరమరుగు కాబోతోంది. రానున్న ఏడాదికి స్వాగతం చెప్పేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే రిసార్ట్స్ నిండుకున్నాయి. మద్యం షాపుల వద్ద స్టాక్‌లు రెట్టింపయ్యాయి. రెస్టారెంట్లు కాంబో ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. పూల బొకేల షాపులు, కేక్‌లు అమ్మే బేకరీల్లో సందడి మొదలు కానుంది.

నూతన సంవత్సర వేడుకలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని గోదావరి.. సముద్ర తీరాల్లోని రిసార్ట్స్ ముస్తాబయ్యాయి. ఇక్కడకు హైదరాబాద్, బెంగళూరు వంటి మహా నగరాల నుంచి కొత్త అతిథులు వస్తున్నారు. ఐటీ ఉద్యోగులు, ఇతర ఉన్నత ఉద్యోగులు గోదావరి, సముద్ర తీరాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు సమాయత్తం అయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ రిసార్ట్స్ ఈ నెల 31 నుంచి జనవరి 2వ తేదీ వరకూ రెండు నెలల క్రితమే బుక్ అయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏపీటీడీసీ పరిధిలోని దిండి రిసార్ట్స్, సమీపంలోనే ప్రైవేట్‌కు చెందిన సరోవర్ పోర్టు కో, అల్లవరం మండలం ఓడలరేవులోని సముద్రా రిసార్ట్స్‌తో పాటు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోవలంక వద్ద యానాం రిసార్ట్స్, గోదావరి, సముద్ర తీరాన్ని ఆనుకుని ప్రైవేట్ వ్యక్తులకు ఉన్న ఫామ్ హౌస్, గెస్ట్ హౌస్‌లు సైతం నిండుకున్నాయి. డిసెంబర్ 31 ఇయర్ ఎండింగ్ వేడుకలతోపాటు జనవరి 1 నూతన సంవత్సర వేడుకలు ఇక్కడ నిర్వహించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారితో వీటికి డిమాండ్ ఏర్పడింది. అలాగే అమలాపురం, మలికిపురం, తాటిపాక, పుదుచ్చేరి యానాంలోని ఒక మోస్తరు ప్రైవేట్ లాడ్జీల్లో రూమ్‌లకు సైతం డిమాండ్ ఏర్పడింది. యానాంలో పుదుచ్చేరి సీగల్స్ రెస్టారెంట్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించేవారు. అయితే మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా ఇక్కడ నూతన సంవత్సర వేడుకలు వాయిదా వేశారు.

సందడే సందడి

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలోని రివర్ ఫ్రంట్ రిసార్ట్స్ తోపాటు ప్రధాన హోటళ్లు కూడా సందడిగా మారనున్నాయి. రాజమహేంద్రవరం మంజీరా హోటల్‌లో నూతన సంవత్సర వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాకినాడలో సైతం నూతన సంవత్సర వేడుకలకు హోటళ్లు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి.

కాంబో ఆఫర్లు

మద్యం, బిర్యానీలు, మాంసాహారం విక్రయాలు మంగళవారం పెద్ద ఎత్తున జరగనున్నాయి. ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మద్యం దుకాణాల వద్ద ఇప్పటికే బీర్లు, ఇతర రకాల మద్యం పెద్ద ఎత్తున స్టాక్ చేసుకున్నారు. సాధారణ రోజులకన్నా రెట్టింపు స్టాక్ పెట్టుకున్నట్టు మద్యం వ్యాపారులు చెబుతున్నారు. ఇక రెస్టారెంట్లు సైతం ప్రత్యేక నాన్‌వెజ్, కాంబో అఫర్లు ప్రకటించాయి. తమ ఆకర్షణీయమైన ప్రచారంతో సామాజిక మాధ్యమాలను ముంచెత్తుతున్నాయి.



కడియం మార్కెట్‌కు బెంగళూరు నుంచి ప్రత్యేకంగా వచ్చిన పువ్వులు

జోరుగా బొకేలు.. కేకుల విక్రయాలు

నూతన సంవత్సర వేడుకల్లో బొకేలు.. కేక్‌లు ప్రధానమైనవి. పెద్ద ఎత్తున సాగే వీటి కోసం పువ్వుల దుకాణాలు, బేకరీ యజమానులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బొకేల కోసం రప్పించిన ప్రత్యేక పువ్వులతో తూర్పు గోదావరి జిల్లాలోని కడియం పూల మార్కెట్ కళకళలాడుతోంది. బెంగళూరు, కడప, తమిళనాడు నుంచి నుంచి సోమ, ఆదివారాల్లో సుమారు 12 టన్నుల పువ్వులు తీసుకువచ్చారు. ఇప్పటికే ఇక్కడ బొకేలను సిద్ధం చేస్తున్నారు. మంగళ, బుధవారాల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.నాలుగు కోట్ల వ్యాపారం జరుగుతోందని అంచనా.

మద్యం రాకతో ట్రాఫిక్ జామ్

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మద్యం ఏరులా పారుతున్న విషయం తెలిసిందే. దుకాణాలతో పాటు వాటి వద్ద అనధికార పర్మిట్ రూమ్‌లు, బెల్ట్ షాపులు పెరగడంతో మద్యం వినియోగం అధికమైంది. దీనికి తగ్గట్టుగా నూనత సంవత్సర వేడుకల్లో మద్యం అమ్మకాలు అంచనాలకు మించి ఉంటాయని వ్యాపారులు నమ్మకంతో ఉన్నారు. ఇందుకు తగినట్టుగానే డిపోలకు అక్కడ నుంచి మద్యం దుకాణాలకు మద్యం రవాణా జోరుగా సాగుతోంది. కోనసీమ జిల్లా అమలాపురం డిపోకు పెద్ద ఎత్తున మద్యం లోడులు చేరుకున్నాయి. ఇక్కడ బైపాస్ రోడ్డులోని మద్యం డిపో వద్దకు ఒకేసారి 15 నుంచి 20 వరకు మద్యం లారీలు రావడం, వెంటనే దుకాణాలకు తరలించేందుకు చిన్న చిన్న వ్యాన్లు రోడ్డు మీదనే ఉంచడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయిందంటే, నూతన సంవత్సర వేడుకల్లో మద్యం అమ్మకాలపై ఏ స్థాయిలో అంచనాలు ఉన్నాయనేది చెప్పకనే అర్థమవుతోంది.



అమలాపురంలో సిద్ధమవుతున్న బొకేలు



సామాజిక మాధ్యమాల ద్వారా రెస్టారెంట్ల కాంబో ఆఫర్ల ప్రచారం

గీత దాటితే కఠిన చర్యలు

ఎస్పీ కృష్ణారావు వెల్లడి



అమలాపురం టౌన్: ఈ నెల 31వ తేదీ మంగళవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ఇయర్ ఎండింగ్ పేరుతో నిర్వహించుకునే ఏ వేడుకైనా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నిఘాలో భాగంగా 120 పోలీస్ పికెట్‌లు, 40 మొబైల్ పార్టీలు నిరంతరాయంగా గస్తీ కాస్తాయని స్పష్టం చేశారు. అమలాపురం, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం, రావులపాలెం, రాజోలు, కొత్తపేట తదితర ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లలో నిఘా మరింత విస్తృతం చేసినట్లు ఎస్పీ వివరించారు. సాధ్యమైనంత వరకూ ఇయర్ ఎండింగ్, కొత్త సంవత్సరానికి స్వాగత ఏర్పాట్లు ఇళ్ల వద్ద జరుపుకోవాలని సూచించారు. వేడుకల పేరుతో రోడ్డుపైకి వచ్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కార్మిక మంత్రి ఇలాకాలోనే పేపర్ లీకేజీ మూలాలు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 16న జరగాల్సిన సమ్మేటివ్-1 పరీక్ష గణితం పేపరు ముందు రోజే యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో 6 నుంచి 10వ తరగతి వరకూ నిర్వహించాల్సిన పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేసింది. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి, తీగ లాగితే.. జిల్లాలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గంలోని వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్‌లో లీకేజీ తంతు జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆ పాఠశాలలో సోషల్ సబ్జెక్టు బోధిస్తున్న ఉపాధ్యాయుడు తీపర్తి వెంకట సుబ్బారావును, ఎంఈఓ కార్యాలయంలో బఫర్ స్టాక్ నుంచి బయటకు వెళ్లినట్లు గుర్తించి, కస్టోడియన్‌గా ఉండే ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని అమరావతి సైబర్ పోలీసులు విచారిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు లోకేష్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో పేపర్ లీకేజీ జరగడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం.

సమన్వయంతో ప్రభల ఉత్సవం నిర్వహిద్దాం

- దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ
- జగ్గన్నతోటలో అధికారుల పరిశీలన

అంబాజీపేట: ఏటా కనుమ రోజున మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవాన్ని అధికారులు, ప్రజల సమన్వయంతో అత్యంత వైభవంగా నిర్వహిద్దామని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం జగ్గన్నతోటలో తీర్థం జరిగే ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 450 ఏళ్లకు పైగా ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఉత్సవంలో 11 గ్రామాల నుంచి ప్రభలను ఊరేగింపు తీసుకువచ్చి జగ్గన్నతోటలో కొలువు దీరుస్తారన్నారు. దేశ విదేశాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు వచ్చి స్వామివార్లను దర్శించుకుంటారన్నారు. దీనికి సంబంధించి పలు సమస్యలు, ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు వివరించారన్నారు. ప్రభల తీర్థానికి తీసుకువచ్చే రహదారుల్లో శానిటేషన్, తుప్పలు తొలగించాలని, తీర్థంలో బూరలు నిషేధించాలని, ప్రభలు వెళ్లే రహదారుల్లో ఏ విధమైన దుకాణాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని, భక్తులకు తాగునీరు అందించాలని, ట్రాఫిక్ లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారన్నారు. ఈ రహదారుల్లో ట్రాఫిక్ ఉండటంతో ప్రభలు వచ్చి వెళ్లడానికి ఎక్కువ సమయం పడుతుందన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం రుద్ర ప్రభలు పంట చేలను దాటుకుంటూ అప్పర్ కౌశిక్ డ్రైన్ దాటి గట్టు ఎక్కి వెళతాయన్నారు. ఈ రెండు ప్రభలు కాలువను దాటుకుని వెళ్లేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుందన్నారు. ఈ కాలువ, పంట చేలు దాటే గట్లకు ఇసుక బస్తాలు వేయడం వల్ల ఈ రెండు ప్రభలు సులువుగా దాటి తీర్థంలోకి వెళ్లేందుకు వీలుగా ఉంటుందని చెప్పారు. తీర్థం, ప్రభలపై ఎటువంటి రాజకీయ, సినీ, ఇతరుల ఫోటోలు పెట్టకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖాధికారి బి.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



జగ్గన్నతోటలో ప్రభల ఉత్సవం జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

సాంకేతిక పద్ధతుల్లో నేర పరిశోధన

- సత్ఫలితాలనిస్తున్న కొత్త విధానం
- నేర సమీక్షలో ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: అందివచ్చిన సాంకేతికతతో చేస్తున్న నేర పరిశోధనలతో సత్ఫలితాలు సాధిస్తున్నామని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన 2024లో పలు విభాగాల క్రైమ్ కేసుల ప్రగతిని వివరించారు. రోడ్డు ప్రమాదాలు 27 శాతం మేర తగ్గాయని ఎస్పీ వివరించారు. జిల్లా మొత్తం మీద క్రైమ్ రేటు 0.82 శాతం మేర స్వల్పంగా పెరిగిందని చెప్పారు. ముఖ్యంగా 2024 మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలను జిల్లా పోలీస్ శాఖ అత్యంత సమర్థవంతంగా నిర్వహించిందన్నారు. నేర పరిశోధనలో డ్రోన్‌ల వ్యవస్థను విప్లవాత్మకంగా తీసుకు వచ్చామని గుర్తు చేశారు. ఇప్పటికే ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్‌కు డ్రోన్ నిర్వహణపై మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చామన్నారు. గత ఏడాది జిల్లాలో 6,818 కేసులు నమోదైతే, ప్రస్తుతం 6,874 మేర కేసులు వచ్చాయన్నారు. గత సంవత్సరంలో హత్యలు 24 జరిగితే, ఈ ఏడాది కేవలం 9 మాత్రమే జరిగాయని వివరించారు. ఆస్తుల చోరీల కేసులకు సంబంధించి గత ఏడాది 499 కేసులు నమోదైతే, ప్రస్తుతం 404 కేసులు నమోదయ్యాయని అన్నారు. అత్యాచార కేసులు గత సంవత్సరం 57 జరిగితే, ప్రస్తుత ఏడాది 46 జరిగాయన్నారు. పోక్సో కేసులు గతంలో 58, ఇప్పుడు 40 నమోదయ్యాయని అన్నారు. సైబర్ నేరాలు అప్పట్లో 80 జరిగితే, ఈ ఏడాది 44 జరిగాయన్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన భారీ చోరీ కేసు, పామర్రు మండలం యర్రపోతవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జరిగిన అవమాన కేసుల్లో జిల్లా పోలీస్ శాఖ అత్యంత పకడ్బందీగా రికవరీ, నిందితుల అరెస్ట్ విషయాల్లో చూపిన చొరవకు రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా రెండు సార్లు ఏసీబీడీ అవార్డులను ఎస్పీతో పాటు పోలీస్ అధికారులు అందుకున్నారు. పలు కేసుల దర్యాప్తులో అత్యంత పరిశోధనాత్మకంగా పని చేసి నిందితులను అరెస్ట్ చేసి ఆస్తులను రికవరీ చేసిన జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్సైలకు ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్‌లు రివార్డులు అందజేశారు. ఇందులో స్పెషల్ బ్రాంచ్ సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాస్, రాజోలు సీఐ టీవీ నరేష్, కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర, మండపేట టౌన్ ఎస్సై హరికోటిశాస్త్రి, ఆలమూరు ఎస్సై అశోక్, జిల్లా ఆర్మ్‌డ్ ఆర్‌ఐ ఎన్.బ్రహ్మానందం, క్రైమ్ టీమ్ ఎస్సై కె.ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కార్యాలయ ఏఓ జగన్నాథం, కమ్యూనికేషన్ ఏఎస్‌ఐ రాజ్‌ప్రకాష్ ఉన్నారు.



కేసుల దర్యాప్తులో ప్రతిభ చాటిన సీఐ, ఎస్సైలకు రివార్డులు అందజేస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్

విసిగిపోయాం.. రోడ్డెక్కాం

- ముంపు సమస్యపై రైతుల ఆందోళన
- అల్లవరం ప్రధాన రహదారిపై బైఠాయింపు

అల్లవరం: చెప్పి చెప్పి విసిగిపోయాం.. చివరికి రోడ్డెక్కాం.. ఇప్పటికైనా ముంపు సమస్య తీర్చాలంటూ రైతన్నలు ఆందోళనకు దిగారు. వర్షాకాలం ముగిసి నెల రోజులు కావొస్తున్నా నేటికీ పొలాల్లో ముంపు నీరు దిగడం లేదని, అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని రెల్లుగడ్డ, అల్లవరం, ఎంట్రుకోన, తుమ్మలపల్లి గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అల్లవరం స్టేట్ బ్యాంక్ ఎదురుగా రోడ్డుపై ఆ గ్రామాలకు చెందిన రైతులు బైఠాయించి తమ ఆవేదనను వెళ్లగక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా వ్యర్థాలు కాలువల్లోకి వదిలేయడంతో పొలాలకు ముంపు సమస్య వస్తుందన్నారు. డ్రైన్లు ఆక్రమణలకు గురై, చెత్తాచెదారంతో నిండిపోయాయని అన్నారు. దీనివల్ల పొలాల నుంచి ముంపు నీరు వెళ్లే మార్గం లేకపోయిందని చెప్పారు. ఈ ముంపుతో గత ఖరీఫ్‌లో పంట వేసుకునే అవకాశం కోల్పోయామని, కనీసం దాళ్వాలోనైనా ముందుకు వెళ్దామంటే కుదరడం లేదని రైతులు వాపోయారు. ఎన్నిసార్లు చెబుతున్నా కనీసం ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం ఆరంభంలో ఎస్.రామేశ్వరం మొగ మూసుకుపోతే రూ. 30 లక్షలు ఖర్చు చేసినా ముంపునకు పరిష్కారం ఎక్కడ ఉందని రైతు నాయకుడు బొక్కా శ్రీను ప్రశ్నించారు. డ్రైన్స్ అధికారులకు రైతుల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. డ్రైన్ పొడవునా వలకట్లు ఏర్పాటు చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నా చర్యలు తీసుకోవడంలో ఎందుకు విఫలమవుతున్నారో చెప్పాలని నిలదీశారు. ఆక్వా వ్యర్థాలు డ్రైన్లోకి వ్యర్థాలు వదిలేస్తున్నా పట్టించుకోరని, అనుమతులు లేని ఆక్వా సాగు జరుగుతున్నా చర్యలు తీసుకోరని తెలిపారు. డ్రైన్లో ఏర్పాటు చేసిన వలకట్లు శాశ్వతంగా తొలగించి ముంపు సమస్యకు పరిష్కారం చూపకపోతే రైతులంతా కలసి ఆమరణ దీక్షకు సైతం వెనకాడబోమని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణలు రైతుల వద్దకు వచ్చి వారి సమస్యలను విన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, వ్యవసాయ, డ్రైన్, ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులతో కలసి పరిశీలన చేసి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు బొక్కా ప్రసాద్, పితాని సూర్యనారాయణ, వాసర్ల సత్యనారాయణ, పెన్మత్స సత్యనారాయణరాజు, మొల్లేటి వీరభద్రరావు, ఆంజనేయులు, వెదుళ్లపల్లి సుబ్రహ్మణ్యం, బసవా వెంకటేశ్వరరావు, పులిదిండి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై దృష్టి సారించండి

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఇతర మండల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీఓలు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గుర్తించిన ఖాళీ స్థలాల్లో ఫల సాయాన్నిచ్చే పండ్ల మొక్కలను పెంచేందుకు అంచనాలను రూపొందించి జనవరి 10 నాటికి నివేదిక ఇవ్వాలన్నారు. నరేగా అనుసంధానంతో పంట కాలువలు, డ్రైన్లు గట్ల బలోపేతానికి చర్యలు చేపడుతూనే గట్లపై ఫల సాయాన్నిచ్చే మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న పుష్కరాలకు సంబంధించి అన్ని డివిజన్ల పరిధిలో స్నాన ఘట్టాలు ఎలా ఉన్నాయో గుర్తించి, అభివృద్ధి పనులకు అంచనాలను రూపొందించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ

జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వివిధ సాంకేతిక అంశాలతో రూపొందించిన డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉద్యోగులంతా కొత్త ఆశలు, ఆశయాలతో ఆనందంగా గడపాలని అన్నారు. జిల్లా పంచాయతీ రాజ్ ఎస్‌ఈ పి.రామకృష్ణారెడ్డి, డివిజనల్ ఇంజినీర్లు అన్యం రాంబాబు, పీఎస్ రాజకుమార్, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అసిస్టెంట్ల నూతన సంవత్సర డైరీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	12,500 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

కొనసాగుతున్న పోలీస్ పహారా



మండపంలో పహారా కాస్తున్న పోలీసులు

శంఖవరం: మండపం గ్రామంలో ఇటీవల ఒక వర్గంపై మరో వర్గం దాడి చేయడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ పహారా కొనసాగిస్తున్నట్లు అన్నవరం ఎస్సై హరిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ ఎస్పీ ఆదేశాల మేరకు నిందితులను అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం జువైనల్ కోర్టులో హాజరు పరిచామన్నారు. కోర్టు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు. గ్రామంలో ప్రజలు వివాదాలకు తావులేకుండా స్నేహభావంతో మెలగాలని సూచించారు.

విద్యుదాఘాతానికి లారీ క్లీనర్ మృతి



మృతి చెందిన క్లీనర్ నాగేశ్వరరావు

పెద్దాపురం: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందినట్లు పెద్దాపురం ఎస్సై మౌనిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని చినబ్రహ్మదేవం కేబీకే బయోటెక్ పరిశ్రమకు లారీలో సరకు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో లారీపై బరకాలను క్లీనర్ పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం మట్టపర్రు గ్రామానికి చెందిన పెచ్చెట్టి నాగేశ్వరరావు (60) తీస్తున్నాడు. బరకాలు తొలగిస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నెత్తురోడ్డుతున్నాయి

- రహదారులపై రక్తపుధార
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పెరిగిన ప్రమాదాలు
- 1,838 ఘటనల్లో 674 మంది మృత్యువాత
- వాహనదారులపై 45,947 కేసులు
- అయినా కానరాని కనువిప్పు



మడికిలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)



పి.గన్నవరం మండలం ఊడిమూడి వద్ద మధ్య డెల్టా ప్రధాన కాలువలో బోల్తా పడిన కారు (ఫైల్)



అలమూరు: దారులు ఎరుపెక్కుతున్నాయి.. నిత్యం రక్తంతో తడుస్తున్నాయి.. ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోకపోవడం రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.. వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడం, రహదారులు విస్తరణకు నోచుకోకపోవడం, రోడ్ల మరమ్మతులు చేపట్టకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. మైనర్లు స్పోర్ట్స్ బైక్‌లను వేగంగా నడపడం ప్రాణాలను హరిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం కూడా ప్రమాదాల్లో మరణాలకు కారణమవుతున్నాయి. లైసెన్స్ లేకుండా, తప్ప తాగి వాహనాలు నడపడం, అపరిపక్వత డ్రైవింగ్ విధానం, మితిమీరిన వేగంతో కూడా ప్రతి రోజు ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసు, రవాణా శాఖ ఏటా రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నా, నిబంధనలను అతిక్రమించిన వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నా పరిస్థితుల్లో ఎక్కడా మార్పులు రావడం లేదు. మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది సుమారు 30 శాతం అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఉమ్మడి జిల్లా రెండో స్థానంలో ఉన్నట్లు రవాణా శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

ఇంత జరుగుతున్నా ఏం చేస్తున్నారో!

రహదారులపై రోజురోజుకూ పెరుగుతున్న ప్రమాదాల నియంత్రణపై రవాణా శాఖకు సమగ్రమైన విధానం, చిత్తశుద్ధి లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రహదారి నిబంధనలు సక్రమంగా అమలు చేయకపోవడం వల్లే ప్రమాదాల సంఖ్య పెరగడానికి కారణమవుతుంది. ఉమ్మడి తూర్పు గోదావరిలోని మూడు జిల్లాల్లో 10,38,986 వాహనాలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 30 నాటికి 1,838 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. అందులో 674 మంది మృత్యువాత పడగా, అనేక మంది క్షతగాత్రులయ్యారు. నిబంధనలను ఉల్లంఘించిన 45,947 మంది వాహనదారులపై కేసులు నమోదైనా ప్రమాదాల తీవ్రత మాత్రం తగ్గడం లేదు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఉన్న 216, 216ఏ జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర రహదారుల్లో ఇప్పటికే ప్రభుత్వం 169 బ్లాక్ స్పాట్‌లను గుర్తించిన అధికారులు, ఆ మేరకు నష్ట నివారణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాల తీవ్రత తగ్గడం లేదు.

కారణాలు ఇవే..

రహదారి భద్రత నియమాలపై అవగాహన లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, ప్రయాణంలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడం, మలుపులు వద్ద వేగ నియంత్రణ లేకపోవడం, కూడళ్లలో రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా మితిమీరిన వేగంతో దూకుడుగా వెళ్లడం, ఒకే ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి ప్రయాణిస్తున్న సమయంలో సమన్వయం చేసుకోలేక అదుపుతప్పి పడిపోవడం, మద్యం మత్తులో వాహనాన్ని నడపడం, నిర్లక్ష్య ధోరణిలో డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ బండి నడపడం, సరైన నైపుణ్యం లేని డ్రైవింగ్, వాహనాల సామర్థ్యం సక్రమంగా లేకపోవడం కూడా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుంది.

చైతన్యం ఎక్కడ!

జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలే కనిపిస్తున్నాయి. అందులో మరణాలు అధికంగానే ఉంటున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం వల్లే ఈ ప్రమాదాల తీవ్రత పెరుగుతుందని ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో రవాణా శాఖ తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. హెల్మెట్ ధరించని వారి లైసెన్సులు సైతం రద్దు చేస్తామని ప్రకటించినప్పుడు కొంతమేరకైనా ప్రమాదాల, మరణాల సంఖ్యను తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకూ హెల్మెట్ ధరించని వారిపై భారీ స్థాయిలో 20,659 కేసులు నమోదు చేసి రూ.1.62 కోట్ల జరిమానా వసూలు చేసినట్లు తెలుస్తోంది. అయినా హెల్మెట్ ధారణపై ప్రజల్లో మాత్రం చైతన్యం రాకపోవడం ఆందోళన కలిగిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో వాహనాల సంఖ్య

ద్విచక్ర వాహనాలు	8,97,675
నాలుగు చక్రాల వాహనాలు (కార్లు)	75,845
ఆటోలు	33,869
సరకు రవాణా వాహనాలు	28,365
స్కూల్ బస్సులు	3.232
నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు	
హెల్మెట్ లేకపోవడం	20,653
సీటు బెల్ట్ ధరించకపోవడం	2,302
మితిమీరిన వేగం	4,711
లైసెన్స్ లేకపోవడం	13,236
పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం	1,718
అపసవ్య దిశలో ప్రయాణించడం (రాంగ్ రూట్)	3,194
మద్యం తాగి వాహనాన్ని నడపడం	131

కొన్ని ఘటనలు పరిశీలిస్తే..



జొన్నాడ- కాకినాడ రోడ్డులో జరిగిన ప్రమాదంలో నుజ్జయిన ఆటో (ఫైల్)

కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేటలో నవంబర్ 10న అర్ధరాత్రి దాటాక ప్రయాణిస్తున్న కారు పంట కాలువలో మునిగిన సంఘటనలో ఒక మహిళతో ఇద్దరు పిల్లలు మృత్యువాత పడ్డారు. విహారయాత్రకు వెళ్లి ఇంటికి చేరుకుంటున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. కాకినాడ జిల్లాలోని తొండంగి మండలం కొత్త ముసలయ్యపేట వద్ద ఈ ఏడాది జనవరి 8న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు మండలం గోపవరం వద్ద అక్టోబర్ 21న ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో తణుకు మండలం పైడిపర్రుకు చెందిన భార్యాభర్తలు మృత్యువాత పడ్డారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లోని ప్రధాన రహదారుల్లో అనునిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది అసువులు బాశారు.

ప్రత్యేక డ్రైవ్ చేపడతాం

ఏటా రహదారి భద్రత వారోత్సవాలు చేపట్టి రోడ్డు నిబంధనలపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం. రోడ్డు ప్రమాదాల్లో నిత్యం అనేక మంది మృత్యువాత పడుతున్నా హెల్మెట్ ధారణపై చలనం లేకపోవడం దారుణం. పోలీసులు తనిఖీలు చేసేది వాహనచోదకుల కోసమేనని గ్రహించాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో ప్రమాదాలపై ఉదాసీనంగా ఉండవద్దని సూచించింది. హెల్మెట్‌ధారణ తప్పనిసరిగా ఆచరించేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. దీనిని అనుసరిస్తూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నాం.

–డి.శ్రీనివాసరావు, జిల్లా రవాణాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఇసుక అక్రమ తవ్వకాలపై టీడీపీ నాయకుడి ఫిర్యాదు

పి.గన్నవరం: గ్రామ శివారు డీఎస్ పాలెం వద్ద వైనతేయ నదీపాయలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్టు టీడీపీ జిల్లా కార్యదర్శి పడాల వెంకటేశ్వరరావు (సూపర్) తెలిపారు. కూటమి నేతల ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా డీఎస్ పాలెంలో ఇసుక అక్రమ ర్యాంపు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ ర్యాంపులో చట్ట విరుద్ధంగా ఇసుకను తీస్తూ రోజూ వందలాది ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సూపర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్విడెక్టుకు సమీపంలో ఇసుక తీస్తుండటంతో ఆ కట్టడం మనుగడకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పేదలకు అందాల్సిన ఉచిత ఇసుకను ఒక నాయకుడు అక్రమంగా నిల్వ చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని, దీంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. ఇదిలా ఉండగా సోమవారం డీఎస్ పాలెంలో అనధికార ఇసుక ర్యాంపును అధికారులు మూయించి వేశారు. ఆర్డీఓ ఆదేశాలతో ఆర్ఐ, వీఆర్వోలు అక్కడికి వెళ్లి ర్యాంపు మూసివేయాలని నిర్వాహకులను హెచ్చరించారు. దీంతో ఇసుక ర్యాంపు తాత్కాలికంగా మూతబడింది.

సృజన... సరికొత్త ఆవిష్కరణ

- వచ్చే నెలలో జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు
- ప్రాజెక్టుల ప్రదర్శనకు సైన్స్ విభాగం ఏర్పాట్లు
- వేదిక కానున్న పి.గన్నవరం జెడ్పీ హైస్కూల్



రాయవరం: ఆలోచనకు పదును పెడితే అద్భుతమే.. సృజనను వెలికితీస్తే అందలమే.. పాఠ్య పుస్తకాల్లో నేర్చుకున్న విజ్ఞానంతో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడితే అందరిలో ప్రత్యేకమే.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికి తీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఇన్‌స్పైర్ మనాక్, బాలల సైన్స్ కాంగ్రెస్, జాతీయ సైన్స్ దినోత్సవాలను నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు జిల్లా సైన్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణకు విద్యాశాఖ చురుగ్గా ఏర్పాట్లు చేస్తుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వచ్చే నెలలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు చేపడుతున్నారు. మంగళవారంతో మండల స్థాయిలో పోటీలు ముగియనున్నాయి. జిల్లా స్థాయి పోటీలను వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించేందుకు అన్నీ సిద్ధం చేస్తున్నారు.

మూడు కేటగిరీల్లో పోటీలు

విద్యా, వైజ్ఞానిక పోటీలను ప్రధానంగా మూడు కేటగిరీల్లో ఎనిమిది అంశాల్లో నిర్వహించనున్నారు. వ్యక్తిగత, సామూహిక, టీచర్ ఎగ్జిబిట్ అనే మూడు కేటగిరీల్లో.. భౌతికశాస్త్రం (పీఎస్), రసాయనిక శాస్త్రం (కెమిస్ట్రీ), గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, జీవశాస్త్రం, ఇంజినీరింగ్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అనే అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థులు వ్యక్తిగతంగా, బృందాలుగా పోటీ పడవచ్చు. ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కూడా పోటీల్లో పాల్గొనే అవకాశముంది. ఉపాధ్యాయ విభాగంలో పోటీ పడేవారు ఎనిమిది విభాగాల్లో ఏదో ఒక దానిని ఎంచుకుని ఒక ఉపాధ్యాయుడు మాత్రమే పాల్గొంటారు. వ్యక్తిగత విభాగంలో పోటీపడే విద్యార్థులు ఎనిమిది అంశాల్లో ఏదో ఒక అంశాన్ని ఎంచుకుని గైడ్ టీచర్‌తో కలసి పోటీ పడవచ్చు.

ఎవరెవరు పాల్గొనవచ్చంటే..

ప్రతి పాఠశాల నుంచి విద్యార్థి వ్యక్తిగత, గ్రూపు, టీచర్ విభాగం నుంచి ఒక్కొక్క ప్రాజెక్టును మాత్రమే తొలుత మండల స్థాయిలో ప్రదర్శించాలి. మండల స్థాయిలో సాధారణ పాఠశాలలతో పాటు, అటల్ ల్యాబ్ ఉన్న పాఠశాలలు కూడా ప్రత్యేకంగా పాల్గొనవచ్చు. అటల్ ల్యాబ్‌లో తయారు చేసిన ప్రాజెక్టులు మాత్రమే ప్రదర్శించాలి. అదేవిధంగా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాల ప్రాజెక్టులు నేరుగా జిల్లా స్థాయికి నామినేట్ అవుతాయి. జిల్లా స్థాయిలో వ్యక్తిగత విభాగం, గ్రూపు, టీచర్స్ విభాగాల నుంచి రెండు ప్రాజెక్టుల చొప్పున మొత్తం ఆరు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీలు జనవరి మొదటి వారంలో నిర్వహించే అవకాశముంది. రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాల నుంచి వచ్చిన వ్యక్తిగత విభాగాల నుంచి 15 ప్రాజెక్టులను, గ్రూపు విభాగాల నుంచి పది, ఉపాధ్యాయ విభాగం నుంచి పది ప్రాజెక్టులు మొత్తంగా 35 ప్రాజెక్టులను రీజనల్ స్థాయికి పంపిస్తారు. రీజనల్ స్థాయిలో తొమ్మిది రాష్ట్రాల నుంచి పోటీ పడతారు. ఈసారి రీజనల్ స్థాయి పోటీలను 2025 జనవరి 21, 22, 23 తేదీల్లో పుదుచ్చేరిలో నిర్వహించనున్నారు. రీజనల్ స్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలు పోటీ పడతాయి.



ఓ విద్యార్థి తయారు చేసిన ప్రాజెక్టు (ఫైల్)

ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి



జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు నాణ్యమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలు ప్రతిబింబించే విధంగా, జాతీయ స్థాయిలో మన జిల్లా ప్రతిభ కనబర్చే విధంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి.

–గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి

మేధా సంపత్తికి పదును



విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయి. పాఠశాల, మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. విద్యార్థుల్లోని మేధా సంపత్తికి పదును పెట్టేందుకు, ప్రతిభను వెలికి తీసేందుకు ఉపకరించే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించాలి.

–డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ

కనీస వేతనాలు చెల్లించాలి



గోపాలమిత్ర సంఘ నూతన కమిటీ సభ్యులుగా ఎన్నికైన కాకినాడ, కోనసీమ జిల్లాల సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పశు సంవర్ధక శాఖలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్న గోపాలమిత్రలకు కనీస వేతనాలు లేక అవస్థలు పడుతున్నారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం అన్నారు. సోమవారం కాకినాడలోని పశు సంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో గోపాలమిత్ర సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగింది. అనేక ఏళ్లుగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు పశువుల పెంపకం, వాటికి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, టీకాల విషయంలో అవగాహన కల్పిస్తూ గోపాలమిత్రలు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. వీరిని రాష్ట్ర ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాకినాడ, కోనసీమ జిల్లాల కమిటీలను ఎన్నుకున్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా బి.నానాజీ, ఉపాధ్యక్షుడిగా సత్య నాగకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా వై.సత్యనారాయణ, కోశాధికారిగా కేసీహెచ్ అప్పన్న, కమిటీ సభ్యులుగా ఎస్.వెంకటలక్ష్మి, బి.రాజబాబు, ఎస్.ప్రసాద్, బి.కాశీ విశ్వనాథంలను ఎన్నుకున్నారు. కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ సురేష్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రతన్‌రాజు, సహాయ కార్యదర్శిగా వై.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.వెంకటరావు, కమిటీ సభ్యులుగా వై.గోవింద్, ఎం.సంజీవరావు, సీహెచ్ రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు, కె.గోపాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దేహదారుఢ్య పరీక్షకు 273 మంది హాజరు



వంద మీటర్ల పరుగులో పోటీ పడుతున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

కాకినాడ క్రైం: కాకినాడలోని జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం కానిస్టేబుల్ నియామక దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 273 మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో తదుపరి పరీక్షలకు 163 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థుల నియామక ప్రక్రియను ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం పర్యవేక్షించారు. హాజరైన అభ్యర్థులంతా ప్రాథమిక రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారే.